క్లుప్తంగా

ఎమ్మెల్యే చంటిబాబును కలిసిన నేతలు



ఇర్రిపాకలో వెస్లీ, ఏడుకొండలును సత్కరించిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల క్రిస్టియన్ మైనారిటీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన జాన్ వెస్లీ, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన గుల్లా ఏడుకొండలు శుక్రవారం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కలిశారు. ఎమ్మెల్యే చంటిబాబు వారికి అభినందనలు తెలిపి సత్కరించారు. పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

తహసీల్దార్‌గా భీమారావు



రౌతులపూడి: మండల తహసీల్దార్‌గా భీమారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాలయంలో పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వీవీవీ సత్యనారాయణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సహకారంలో మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. సచివాలయాల్లో పనిచేసే రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'జగనన్న పాలవెల్లువ'పై అవగాహన

కోటనందూరు: మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకాన్ని రూపకల్పన చేసిందని పశువైద్యాధికారి రత్నతేజ అన్నారు. మండలంలోని బొద్దవరంలో శుక్రవారం సర్పంచ్ వేగి లక్ష్మి అధ్యక్షతన జగనన్న పాలవెల్లువ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నతేజ మాట్లాడుతూ పాలవెల్లువ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో మహిళా డెయిరీ సహకార సంఘాలను ఏర్పాటు చేస్తారన్నారు. ఈ సంఘ సభ్యులు డెయిరీకి పాలు పోయడంతో పాటు ఇతర రైతులు కూడా పాలు పోసేలా ప్రోత్సహిస్తారన్నారు. మహిళా సహకార సంఘాల ద్వారా సేకరించిన పాలను అమూల్ సంస్థ నేరుగా కొనుగోలు చేస్తుందన్నారు. పాడి రైతులు పాల వెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న పాలవెల్లువను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళి సూచించారు. మండలంలోని ఏవీ నగరంలో రైతులకు శుక్రవారం జగనన్న పాలవెల్లువపై అవగాహన సదస్సు నిర్వహించారు.

విజయవాడ మహాసభను విజయవంతం చేయాలి

తుని: రేషన్ డీలర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ జూలై 23న విజయవాడలో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని రేషన్ డీలర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మండాది వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక పాతబజారు వీధి పొగాకు వర్తకసంఘం భవనంలో శుక్రవారం రేషన్ డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లకు జరుగుతున్న అన్యాయాన్ని, ఆర్థికంగా డీలర్లు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయడమే ఈ మహాసభ ఉద్దేశమన్నారు. కాకినాడ జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చి డీలర్లకు అన్యాయం చేసిందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి శ్రీనివాస్, కోశాధికారి జె.శివకుమార్, తూర్పుగోదావరి జిల్లా ప్రెసిడెంట్ బీవీఎస్ సాయిరెడ్డి, తుని టౌన్, తుని రూరల్, కోటనందూరు, రౌతులపూడి, తొండంగి మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎంఈఓ-2గా గోవింద్

శంఖవరం: మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ)-2గా టి.గోవింద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అడ్డతీగల జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేస్తున్న ఆయన పదోన్నతికి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎంఈఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ ధర్నా

ఏలేశ్వరం: మండల పరిధిలోని జె.అన్నవరం, తిరుమాలి గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని కోరుతూ శుక్రవారం పట్టణంలో ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్)వినోద్ మిశ్రా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా పార్టీ నాయకులు మాట్లాడుతూ జె.అన్నవరంలో ప్రభుత్వ భూమి 26 ఎకరాలు, తిరుమాలిలో భూదాన భూమి 12 ఎకరాలు భూస్వాముల అక్రమణలో ఉన్నాయన్నారు. వీటిని తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

స్వగృహదానందం

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- తుని మండలంలో 6951 మందికి ఇళ్ల స్థలాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



వి.కొత్తూరు జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇళ్లు



ఎస్.అన్నవరంలో ఖరీదైన స్థలాల్లో నిర్మిస్తున్న ఇళ్లు

తుని రూరల్: పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. పేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతుండడంతో కొత్తగా ఊళ్లకు ఊళ్లే వెలుస్తున్నాయి. 2014–19 మధ్య కాలంలో అప్పటి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షలు ఇళ్లస్థలాలు మంజూరు చేయగా వేలాది లేఅవుట్లలో లక్షలాది ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో పేదల సొంతింటి కల నెరవేరుతోంది.

తుని మండలంలో 28 లే అవుట్లు

తుని మండలంలోని లబ్ధిదారులకు వివిధ గ్రామాల్లో లే అవుట్లు, తుని పట్టణవాసులకు రాజుపేట శివారులో ఏర్పాటు చేసిన లే అవుట్‌లో ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. మొత్తంగా 28 లే అవుట్లలో 6951 మందికి ప్రయోజనం చేకూరుతుంది. ఒక్కో లబ్ధిదారుడి ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తున్న ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక, రాయితీపై ఇనుము, సిమెంట్ అందిస్తోంది. పలు గ్రామాల్లో ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తవడంతో వందలాది మంది గృహ ప్రవేశాలు చేసి కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవిస్తున్నారు.

మౌలిక వసతులు కల్పన

ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రధానంగా విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులను అందుబాటులోకి తెస్తోంది. రూ.12 కోట్లతో హంసవరంలో 132 కేవీ విద్యుత్ స్టేషన్, ఎస్.అన్నవరం, రాజుపేటల్లో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తోంది. మరోపక్క జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధి దీపాలను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు, తాగేందుకు అవసరమైన నీటి వనరులను అందుబాటులో ఉంచారు. వీధి కుళాయిలు ఏర్పాటు చేసిన గ్రామీణ తాగునీటి శాఖ అధికారులు ఇంటింటికీ కుళాయి ఇనెక్షన్ ఇస్తున్నారు. ఇప్పటికే వాటర్ ట్యాంకులను నిర్మించి, బోరుబావులు తవ్వకాన్ని పూర్తి చేశారు. సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాల్సి ఉంది.

తుని మండలంలో లబ్ధిదారుల వివరాలు

మొత్తం లేవుట్లు	: 25
మంజూరైన ఇళ్లస్థలాలు	: 2353
నిర్మాణంలో ఉన్న పునాదులు	: 1388
వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు	: 636
పూర్తయిన ఇళ్లు	: 327
తుని పట్టణవాసులకు...	
లే అవుట్లు	: 3
మంజూరైన ఇళ్ల స్థలాలు	: 4598
నిర్మాణంలో ఉన్న పునాదులు	: 3515
వివిధ దశాల్లో నిర్మిస్తున్న ఇళ్లు	: 955
పనులు ప్రారంభించనవి	: 99
పూర్తయిన ఇళ్లు	: 29

అద్దె ఇంటి కష్టాలకు చెక్



మేము ఉమ్మడి కుటుంబంతో సుమారు 12 సంవత్సరాలకు పైగా అద్దె ఇంట్లోనే కాపురం ఉన్నాం. అద్దె ఇళ్లలో ఎన్నోబాధలు పడ్డాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటిస్థలం, రుణం మంజూరు చేసింది. దాంతో ఇల్లు నిర్మించుకుని ఆరు నెలలుగా సొంతింట్లో నివాసం ఉంటున్నాం.
– మేరపురెడ్డి అరుణ, వి.కొత్తూరు, తుని మండలం.

తొమ్మిది నెలలుగా సొంతింట్లోనే..



ఇంటి స్థలానికి, రుణం మంజూరుకు ఎవ్వరూ ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోలేదు. ఇంటి స్థలం ఇచ్చిన ప్రభుత్వం రుణాన్ని మంజూరు చేసింది. ఉచితంగా ఇసుక ఇచ్చి, రాయితీపై ఇనుము, సిమెంట్ ఇచ్చారు. ఇల్లు నిర్మించుకుని తొమ్మిది నెలలుగా నివాసం ఉంటున్నాను.
– తమరాన లక్ష్మి, లబ్ధిదారు, వి.కొత్తూరు, తుని మండలం

దేవుడిలా ఇల్లు ఇచ్చారు



రొక్కాడితేనేగానే డొక్కాడని కుటుంబం మాది. అటువంటి మేము జీవితంలో సొంతింట్లో ఉంటామని ఊహించలేదు. సీఎం జగన్ భగవంతుడిలా ఇల్లు ఇచ్చారు. పిల్లలతో సంతోషంగా సొంతింట్లో ఉంటున్నాం. కరెంటు వచ్చింది. ఇంటి దగ్గరే తాగునీటి కుళాయి ఉంది.
– బద్దా వెంకటలక్ష్మి, లోవకొత్తూరు, తుని మండలం

నిత్యం పర్యవేక్షణ



మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి. ఇసుక, సిమెంట్, ఇనుము పంపిణీ, బిల్లులు చెల్లింపు పారదర్శకంగా జరుగుతోంది. ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం లేకుండా లే అవుట్ల వారీగా నిత్యం పర్యవేక్షిస్తున్నాం. అవసరమైన వారందరికీ సాంకేతిక సహాయం అందిస్తున్నాం.
– ముద్రగడ నాయుడు, ఏఈ, హౌసింగ్, తుని రూరల్

770 మంది విద్యార్థులతో ఒలింపిక్ రన్



వి.కొత్తూరులో హైవేపై ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్న విద్యార్థులు

తుని రూరల్: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని వి.కొత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఏ.సింహాద్రి ఆధ్వర్యంలో 700 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఒలింపిక్ టార్చ్ పట్టుకుని జాతీయ రహదారిపై ర్యాలీ చేశారు. ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ ఎం.సుధాకర్, హెచ్‌ఓడీ బి.నాగరాజు, పీడీ ఎస్.రాజేష్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒలంపిక్ రన్ ప్రారంభం

తుని: అంతర్జాతీయ ఒలింపిక్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక రాజా గ్రౌండ్స్‌లో ఒలింపిక్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలిదిండి సత్యనారాయణ ఒలంపిక్ టార్చ్‌ను వెలిగించగా మున్సిపల్ వైస్ చైర్మన్ పి.మహేష్ జెండాను ఎగురవేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నిస్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, అట్యా–పాట్యా అసోసియేషన్ అధ్యక్షుడు గోసల సత్యనారాయణ రన్‌ను ప్రారంభించారు. కేఎస్ జాబేజ్, టి.వెంకటేశ్వరరావు, పలువురు పీడీలు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శ్రీకారం



తునిలో కొబ్బరికాయ కొట్టి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చకచకా అమలు చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 26, 27 వార్డులకు సంబంధించి కోర్టు వీధి, ఈగలవారి వీధి, బత్తాయితోట వీధుల్లో రూ.15 లక్షలతో నిర్మించే కల్వర్టులు, డ్రైన్ల పనులను శుక్రవారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు తెలిపారు. అన్ని వార్డుల్లోనూ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు కుచ్చర్లపాటి రూపాదేవి, పామర్తి మహేష్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, కమిషనర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలి

జగ్గంపేట: మండలంలోని గుర్రంపాలెంలో నిరుపేదలు సాగు చేసుకుంటున్న సీలింగ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు డిమాండ్ చేశారు. గుర్రంపాలెంలో భూములు సాగు చేసుకుంటున్న పేదలతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

గోకవరం: స్థానిక పోలీస్ స్టేషన్ వెనుక వీధిలో సీసీ రోడ్డుకు శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. రూ.4 లక్షలతో నిర్మించే ఈ రోడ్డుకు సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు భూమి పూజ చేశారు. అనంతరం వెలమపేటలో సచివాలయ నిధులతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులను వారు పర్యవేక్షించారు. కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు, వార్డు సభ్యుడు తుమ్మల శివాజీ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

శంఖవరం: రైతులు పకృతి వ్యవసాయం చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవవసాయం జిల్లా మేనేజర్ ఎలియాజర్ అన్నారు. మండలంలోని నెల్లిపూడిలో రైతులకు శక్రవారం ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం రైతులకు రాగి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ పి.గాంధీ, పకృతి వ్యవసాయ కో ఆర్డినేటర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సెంద్రియ సాగుతో లాభాలు

గోకవరం: సెంద్రియ సాగుతో మంచి లాభాలు సాధించవచ్చని న్యాచురల్ ఫామింగ్ అసోసియేట్ ప్రగడ గౌతమ్ అన్నారు. మండలంలోని రంపయర్రంపాలెం, కొత్తపల్లి క్లస్టర్లలో సేంద్రియ సాగు చేసిన పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. సేంద్రియ సాగు చేపట్టిన రైతులతో మాట్లాడి సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు.

నేడు ఆర్‌యూబీ ప్రారంభం

తుని: పట్టణంలో నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)ని శనివారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా, కాకినాడ ఎంపీ వంగా గీత ప్రారంభిస్తారని జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను శుక్రవారం తెలిపారు. తాళ్లూరు రైల్వేగేటు వద్ద రూ.5 కోట్ల వ్యయంతో ఆర్‌యూబీని నిర్మించారు. దీంతో తుని, రౌతులపూడి మండలాలకు చెందిన ప్రజలకు ఎంతో మేలు చేకూరనుంది.

నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



భీమేశ్ నాగశ్రీ

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి ఎంపీపీ పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి కొత్తల ధాత్రి భీమేశ్ నాగశ్రీ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల హెచ్‌ఎం గురాల వేణుబాబు శుక్రవారం తెలిపారు. తమ పాఠశాల నుంచి తొమ్మిది మంది విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్ష రాయగా ధాత్రి భీమేశ్ నాగశ్రీ ప్రతిభ చూపి నవోదయకు ఎంపికై నట్టు చెప్పారు. నాగశ్రీకి శిక్షణ ఇచ్చిన పాఠశాల ఉపాధ్యాయులను ఎంఈఓలు టి.జోసెఫ్, మక్కా చిన్నారావు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

కోటనందూరు: స్థానిక రైతు భరోసా కేంద్రం–2లో రైతులకు రాయితీపై ఇచ్చే వరి విత్తనాల పంపిణీని శుక్రవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్ రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అన్నారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకురావాలని వ్యవసాయ శాఖ సిబ్బంది కోరారు. కార్యక్రమంలో కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను, వీఏఏ మౌళీప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ

రౌతులపూడి: స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. గ్రామంలో వరి సాగు చేసే రైతులకు సర్పంచ్ చిందాడ రాజమ్మ, ఎంపీటీసీ సభ్యుడు బొడ్డు రాజు విత్తనాలను అందజేశారు. రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ సిబ్బంది సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాకి నాని, నాకిరెడ్డి అప్పలనాయుడు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కోటనందూరు: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను మాత్రమే రైతులకు అందబాటులో ఉంచాలన్నారు. విక్రయించిన ప్రతి వస్తువుకు విధిగా రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా జరగాలన్నారు. షాపులు తనిఖీ చేసినప్పుడు నిల్వలు, రికార్డుల్లో వ్యత్యాసాలు ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



అన్నవరంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లతాకుమారి

అన్నవరం: యువత గంజాయి, కొకైన్ వంటి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి సూచించారు. డ్రగ్స్ నివారణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక రాఘవేంద్ర రెసిడెన్సీలో సత్యదేవ డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డ్రగ్స్ వాడకం వలన జరిగే దుష్పరిణామాలను డీఎస్పీ వివరించారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబు, అన్నవరం ఇన్‌చార్జి ఎస్ఐ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రత్తిపాడు: యువత సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ పి.అశోక్ సూచించారు. స్థానిక జాతీయ రహదారిపై అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. సారా, గంజాయి నియంత్రణపై ప్రజలకు పలు సూచనలు చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఏలేశ్వరం: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మహిళా పోలీసులు సూచించారు. ప్రపంచ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం స్థానిక వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ సూర్యనారాయణ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ ప్రవల్లిక మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకూడదన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.

పది లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెంలో 10 లీటర్ల సారాతో గెడ్డద రాంబాబును అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. అదే గ్రామంలో సారా స్థావరాలపై దాడులు నిర్వహించి, సారా తయారీకి సిద్ధం చేసిన వంద లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ సంఘటనలో పరారీలో ఉన్న కందిపల్లి బుజ్జి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పీడీ యాక్ట్‌లో ఒకరి అరెస్టు

జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తిని పీడీ యాక్ట్ కింద అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ పి. అశోక్ శుక్రవారం తెలిపారు. సారా క్రమవిక్రయాలకు అలవాటు పడిన ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెం గ్రామానికి చెందిన జుత్తుక నూకరాజును అదుపులోకి తీసుకుని, పీడీ యాక్టుపై అరెస్టు చేశామన్నారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరచి, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు చెప్పారు.

యువకుడి అదృశ్యంపై కేసు



సాయివంశీ (ఫైల్)

గోకవరం: యువకుడి అదృశ్యంపై గోకవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. హెచ్‌సీ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లికి చెందిన బంటుపల్లి సాయివంశీ స్నేహితులతో ఎక్కువగా కాలం గడుపుతుండటంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెంది ఈ నెల 21న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబ సభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరంలో శుక్రవారం డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు ఏనుగు ధర్మరాజు ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ సేవలను నేటియువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. బీజేపీ నాయకులు కొల్లా శ్రీనివాస్, కురాకుల రాజా, దాకే కృష్ణారావు, కందా వీరాస్వామి, బండారు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి మాజీ సైనికోద్యోగి కర్రి ధర్మరాజు, బీజేపీ సీనియర్ నేత శింగిలిదేవి సత్తిరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

రౌతులపూడి: గ్రామాల్లోని పాడి రైతులు వైఎస్సార్ పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని ములగపూడిలో శుక్రవారం ఆయన పర్యటించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాల్లోని పాడి పశువులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రైతులు ఎప్పటికప్పుడు పశువైద్యాధికారి, పశుసంర్ధకశాఖ సిబ్బందిని సంప్రదించి పశుపోషణకు సంబంధించి పలు సూచనలు, సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, శంఖవరం ఏవీహెచ్ ఏడీ మనోజ్‌కుమార్, విజయ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ లబ్ధి



ఏలేశ్వరంలో సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు

ఏలేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకంతో అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం వర్చువల్ విధానంలో జగనన్న సురక్ష పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సీఎం జగన్ వీడియో కాన్ఫరెన్స్‌ను కమిషనర్‌తో పాటు సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు మేలు చేసేందుకు గాను జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెలరోజులు పాటు నిర్వహిస్తారన్నారు. అర్హులందరూ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శిడగం వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, దోశ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకానికి ప్రత్యేక బృందాలు

తుని రూరల్: మండలంలో జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేసేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీపీ బొప్పన రాము తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ ఎల్.శివకుమార్, ఎంపీడీఓ పి.రవికుమార్, ఏఓ ఎంఎస్‌వీఎస్ శేషగిరిరావు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు గ్రామాల్లో పర్యటిస్తాయన్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆయా గ్రామాల్లో పర్యటించి, అవసరమైన సర్టిఫికెట్లను అందిస్తారన్నారు. వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, ఈఓపీఆర్డీ జయరామ్, అధికారులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: జగనన్న సురక్షా కార్యమాన్ని శుక్రవారం సీఎం జగన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు దోమాల గంగాధర్, తోట గాంధీ, పెంటకోట నాగబాబు, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి తదితరులు సీఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు.

గండేపల్లి: జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు సూచించారు. తాడేపల్లిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు తిలకించారు. సర్పంచ్ రుత్తల లలిత, ఎంపీడీఓ రామన్, తహసీల్దార్ వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రత్తిపాడు: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులు వీక్షించారు. మండల ప్రత్యేకాధికారి, సాంఘిక సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ డీవీ రమణమూర్తి, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' షెడ్యూల్ విడుదల

రౌతులపూడి: వచ్చే నెల ఒకటి నుంచి గ్రామాల్లో చేపట్టే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.గోవింద్ పిలుపునిచ్చారు. జూలై ఒకటి నుంచి వలంటీర్లు, ప్రజా ప్రతినిధుల సమక్షంలో మండలస్థాయి అధికారులు బృందాలు గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. గ్రామాల్లో అధికారుల పర్యటన షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. జూలై 1న శృంగవరం, 3న గిడజాం, 4న ఎస్.అగ్రహారం, 5న రౌతులపూడి–1, 6న ఎ.మల్లవరం, 11న ఎస్ఎన్ పట్నం, 12న పారుపాక, 13న ఎస్.పైడిపాల, 14న ములగపూడి, 15న గుమ్మరేగుల, 18న పి.చామవరం, 19న గంగవరం, 20న రౌతులపూడి–2, 21న రాజవరం, 22న రాఘవపట్నం, 24న లచ్చిరెడ్డిపాలెం, 25న బలరామపురం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు.